స్వాతి వారపత్రిక సాహస కథల పోటీలో బహుమతి పొందిన కథ

# సాహసం శాయరా డింభకా !



"ఎన్టీవోడిలా సాహసం చేసినోడికే రాజ్జెమూ రాకుమారీ దక్కుద్దొరేయ్" మిత్రులకి ఫోజు కొడుతూ అన్నాను.

"ఇది పాతాళ భైరవి కాలం కాదురా రావుడూ, బాహుబలి కాలం" నవ్వేడు రాంపండు.

"అప్పుడూ ఇప్పుడూ ఎప్పుడైనా సరేరా ఉక్కు గుండె ఉన్నోడే దేన్నైనాసరే తుక్కు తుక్కు సేసేసి జెండా ఎగరేత్తాడు"

"మన చుక్క రావుడి మాటలు కోటలు దాటేత్తున్నాయిరోయ్" బిగ్గరగా అన్నాడు మల్లిగాడు నవ్వుతూనే.

నా ఒళ్ళు మండిపోయింది. విసురుగా ఏదో అందామనుకొంటోంటే సన్యాసిరావు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"రాజుగారమ్మాయి స్వయంవరంరా" ఒగురుస్తూ చెప్పేడు.

"ఏ రాజుగారమ్మాయిరా?" రాంపండు అడిగాడు.

"మన రాంచంద్రపురం పులిరాజుగారమ్మాయి. రాజమండ్రిలో ఉంటన్నారు గదా. ఆయనకి ఒక్కతే కూతురు. బంగారు బొమ్మే సినీమా స్టార్లు దిగదుడుపనుకో..."

"ఏం పరీక్ష పెడతన్నార్రా?" అడిగాను.

"తెల్దుగాని పులిరాజుగారు సిన్నప్పుడే పులిని ఏటాడారు కదా. అందుకని అడవిలో కెళ్ళి పులిని ఏటాడమంటారేవోరా!"

"అడవులూ లేవు పులులూ లేవు గాని, చేతులొదిలేసి మోటారు సైకిలు నడప మనొచ్చు" మల్లిగాడు చెప్పాడు.

"ఏదైనా సరే మనోడు ఎడంసేత్తో సేసేత్తాడు. పులిరాజు గారమ్మాయిని పెళ్లాడేత్తాడు. ఎన్టీవోడు తోట రాముడైతే మనోడు చుక్క రాముడు. ఏరా!"

రాంపండు మాటలకీ వాళ్ళ నవ్వులకీ పౌరుషం వచ్చేసింది. "ఓ సూపు సూత్తాను"

నా వంక ఎగాదిగా చూశారు. "పెద్ద సదువులోళ్ళు బోల్డు మందొత్తార్రా. నువ్వేమో టెన్త్ క్లాసోడివి" అని రాంపండు అంటే, "ఆడికేంట్రా పాతికెకరాల కొబ్బరితోటా మగాణీ ఉన్నాయి. ఎవురైనా కళ్ళు మూసుకుని పిల్ల నిచ్చేత్తారు" అన్నాడు మల్లిగాడు.

"అలా ఇవ్వరు. ఏదో సాహసం సెయ్యాల్సిందే" అడ్డొచ్చాడు సన్యాసిరావు.

"ఛలో రాజమండ్రి!"

నలుగురుం మూడు బైకుల మీద పులిరాజు గారింటికెళ్ళేం.

అప్పటికే చాలామంది కుర్రాళ్ళూ పెద్దోళ్ళూ వచ్చేశారు. వాళ్ళ వేషాలూ భాషలూ చూసేసరికి మా కాళ్ళు చల్లబడ్డాయి.

ఒక్కొక్కరూ హుషారుగా లోపలి కెళ్ళి డీలాపడి తిరిగొస్తున్నారు.

నన్ను పిలిచారు. మేమంతా పొలోమంటూ లోపలి కెళ్ళాం.

లోపల పులిరాజుగారూ రాకుమారీ కూర్చునున్నారు.

ఆయన మాజీ రాజులా, ఆమె ప్రస్తుత యువరాణిలా ఉన్నారు.

ఆయన నన్ను పరిశీలిస్తా ఉంటే నేనా అమ్మాయిని చూశాను.

అచ్చం రాకుమారిలానే ఉంది.

ఆ సోయగం, ఆ కళ్ళు, ఆ ఠీవి, ఆ అందం, ఆ చందం – అబ్బో యమగా అదిరిపోతున్నాయ్. నగలంటే ఇష్టం లేదేవోఁ, ఒంటిమీద బంగారవేమీ లేదు. అయినా ఆమె చిర్నవ్వే వజ్రాల నగలా ఉంది!

మా వాళ్ళు నేను చేసిన సాహసాల గురించీ, నా ఆస్తి పాస్తుల గురించీ ఏకరువు పెట్టారు.

"అవన్నీ ఇవాళ ఉంటాయి. రేపు పోతాయి. పెద్ద చదువులు చదివి పెద్ద పెద్ద ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళు కూడా చిన్న గొడవకే పుటుక్కున పురుగు మందో మరోటో తాగేస్తున్నారు. నేన్చెప్పొచ్చేదేంటంటే మనిషికి గుండెకాయ ఉంటే చాలదు అందులో కొండంత ఆత్మవిశ్వాసం ఉండాల. ఇంట్లో డబ్బు సంచులు కాదు ఒంట్లో శక్తి ఉండాల. ఏవొచ్చినా ఎదుర్కోవాల. తొడకొట్టి నిలబడాల. తుపానొచ్చి అంతా ఊడ్చేసినా నిట్ట నిలువుగా నిలబడి మీసం మెలేసినోడే మగాడు. మొనగాడు. అలాటి వాడి కోసం చూస్తున్నాం..." అన్నారు రాజుగారు.

"నేను కరక్టుగా సరిపోతాను"

నా వంక ఇంతింత కళ్ళతో చూశారిద్దరూ.

"ఎన్టీవోడు అటు, మావోడు ఇటు..." అన్నాడు అక్కడే ఉన్న మా సన్యాసి.

"ఉత్త విగ్రహమో లేక అందులో ఏవైనా గుంజూ కలేజా ఉన్నాయో టెస్టు చెయ్యాల. మా పక్కోడివీ, పక్కకి తిరిగితే కన్పించే వోడివీ గనుక, నీకో ఛాన్సిస్తా. ఖతర్నాగ్గా ఉంటాది మరి. మధ్యలో పారొచ్చేయడానికి వీలవదు. ఆలోచించుకో"

"నేను రెడీ"

"ప్రాణాల్తో తిరిగొస్తావో రావో మీ ఇంట్లో ఓ ముక్క చెప్పిరా"

నా మిత్రులు బెంబేలు పడిపోయారు.

"పేణాలుంటే పేలాలు అమ్ముకుని బతకొచ్చు, ఒరె రావుడొరే ఎళ్ళిపోదాం నడరా. మీ అమ్మానాన్నలకి ఒక్కడి వేరా. నీకేవైనా అయితే, మీ అయ్య ముందు మాకు దినం చేసేత్తాడు" రాంపండు భయపడ్తూ అన్నాడు.

"ఏకంగా పెళ్లి చేసుకుని ఎళ్దాం లేరా"

పులిరాజుగారు మందహాసం చేశారు. "నిన్ను చూస్తోంటే ముచ్చటేస్తోందబ్బాయ్. పరీక్షంటే పేపర్ మీద రాయడవో, బైకు తొక్కడవో, నిప్పుల మీంచి నడవటమో, గోదారి

ఈదటమో కాదు...”

“మరేంటని అడగను. దేనికైనా ఎవర్రెడీ”

ఆయన నా వంక తృప్తిగా చూసి కూతురి వంక ప్రశ్నార్థకంగా చూశారు. ఆమె కళ్ళతో సైగ చేసింది. “సరే బయటుండు...”

“ఇంకోపాలి ఆలోసించొరేయ్. పులి గుహలోకి ఎల్తన్నావ్” హెచ్చరించాడు మల్లిగాడు.

నవ్వుతూ లేచి రాకుమారితో అన్నాను “నువ్వు రాకుమారివైతే నేను రాముణ్ణి. నాకు మీ నాన్న రాజ్యమూ సంపదలూ అక్కర్లేదు. అవి నేనే సంపాదించగల్ను. నాకు నువ్వు కావాలి. నీ కోసమే వచ్చాను. పూలదండతో రెడీ గుండు”

పెద్ద పెద్ద అడుగులేసుకుంటూ బయటి కొచ్చాను.

“ఏమేం అడిగారు? పరీక్ష ఎలా ఉంటుందట? బుద్ధి పరీక్షా బల పరీక్షా?” నన్ను చుట్టు ముట్టి అడిగారు అభ్యర్థులు.

“బతుకు పరీక్ష”

“అదేంటి?” అయోమయంగా చూశారు.

“చావుతో సైతం పోరాడి నిలవాలంట” అన్నాను.

“పోతే శాల్తీయే గల్లంతవ్వొచ్చంట” బిగ్గరగా అరిచాడు సన్యాసి.

కొందరు బెదరిపోయారు. “పెళ్లికని వస్తే ఈ చావు గోలేంటి?” అని లేచిపోయారు కొందరు. ఇంకొందరు, “ఇంత రిస్కు తీసుకోవడం అవసరమా?” అని ఊగిసలాడారు.

కడకి నేనుగాక ఇంకో ఇద్దరు మిగిలాం.

పులిరాజుగారొచ్చి “ముందెవరొస్తారు?” అనడిగారు.

నేను ముందడుగేశాను.

“మీ వాళ్ళని ఇళ్ళ కెళ్ళి పొమ్మను. నువ్వెన్నాళ్ళకి తిరిగొస్తావో తెలీదు”

పులిరాజుగారి మాటలకి మావాళ్ళే కాదు మిగతా ఇద్దరూ గుటకలు మ్రింగారు. మరుక్షణం ఒకడు మెల్లగా జారుకున్నాడు.

కారు దగ్గరకి నడిచాం. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా కారు స్టార్టవలేదు.

“పాత కారు కదా ఓ చెయ్యి వెయ్యి” అన్నారు నాతో.

నేను కారు దిగి, డొక్కు కారుని తోస్తోంటే ఆ మిగిలిన ఒక్కడూ జంప్ అయ్యాడు.

ఇక మిగిలింది నేనొక్కడ్నే గనుక నేను గెలిచినట్టు ప్రకటిస్తారనుకుంటూ పరమోత్సాహంగా తోశాను. కారు స్టార్టయ్యింది.

చెమటలు తుడుచుకుంటూ వెళ్ళి కారెక్కాను.

గోదావరి ఒడ్డున కారు దిగాం. ఓ పడవ వాడు ముందుకొచ్చి రాజుగారికి దణ్ణం పెట్టాడు.

"బావున్నావా మల్లిగా..."

"తవంరి దయండి..."

ఇద్దరం పడవ ఎక్కాం. మధ్యలోకి వెళ్తోంది. అక్కడ దింపేసి ఈదుకుంటూ ఒడ్డుకు రమ్మంటారని అర్థమైంది. మా ఊరి కాలవలో వేసుకున్న ఈత పందాలు గుర్తొచ్చాయి. లోతు, దూరం అంచనా వేస్తూ కూర్చున్నాను.

నా ఆలోచనల్ని తల్లక్రిందులు చేస్తూ గోదావరి మధ్యనున్న బుల్లిలంక దగ్గర పడవ ఆపి నన్ను దిగమన్నారు. అయోమయంగా చూస్తూ దిగాను.

"మూణ్రోజుల తర్వాత వస్తాను"

పడవ వెనుదిరిగింది.

ద్వీపం వంక ప్రాన్పడి చూశాను.

ద్వీపం అంటే గోదావరి మధ్యలో ఉన్న మెరక ప్రదేశం. చొప్పగడ్డి, పిచ్చి మొక్కలూ, చిన్న చిన్న పొదలూ తప్ప ఏమీ లేవు. కాస్తంత పోటొస్తే చాలు గోదావరిలో మునిగి పోయి కన్పించకుండా పోద్ది!

గుండెలు దడ దడ లాడాయి. ఇక్కడ మూణ్రోజులుండాలి. ఎలా ఉండాలి. క్రింద నేల పైన ఆకాశం తప్ప ఇక్కడేం ఉన్నాయని?

'పులిరాజుగారూ, ఇదేం పరీచ్చండి బాబూ!' అనుకుంటూ నేల మీద చతికిలబడి సెల్‌ఫోన్ బయటికి తీశాను. సిగ్నల్స్ లేవు.

బయటి ప్రపంచంతో సంబంధం కట్ అన్నమాట!

కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి. పొద్దున్నెప్పుడో టిఫిన్ తిన్నాను. రాజుగారింట్లో బెల్లప్పానకం ఓ గ్లాసుడు ఇచ్చారు. అంతే. ఇప్పుడేం జెయ్యటం? ఏం తిని ఆకలి చల్లార్చుకోడంరా దేవుడా!

ఫర్లాంగు పొడవూ అరఫర్లాంగు వెడల్పూ గల ఆ లంకంతా కలతిరిగాను. ఒక దుంపగాని కాయగాని తినగలిగే మరోటి గాని లేవు. పచ్చగడ్డి, పొడుగ్గా ఎదిగిన చొప్పగడ్డి మాత్రం ఉన్నాయి.

రోజూ తినే పరమాన్నాలు గుర్తొచ్చాయి. గుడ్లలో నీళ్ళు తిరిగాయి.

పైన ఎండ సుర్రుమంటోంది. బట్టలు తీసేసి జాగ్రత్తగా గోదారిలోకి దిగాను. బురద బురదగా ఉంది. కొంచెం లోపలికెళ్ళాను. ఇసుక తగిలింది. నీళ్ళలో జపం చేస్తున్నట్టుగా ఉండిపోయాను. పేల్చేస్తున్న ఎండనుంచి తప్పించుకోడానికి ఇంకో దారి లేదు మరి.

గాలి తిరిగింది. ఎండ వేడి తగ్గింది. నీటిలోంచి వచ్చేశాను. తుడుచుకోడానికి తుండుగుడ్డ లేదు. అటూ ఇటూ తిరిగాను. ఒళ్ళు ఆరిపోయింది. తిరిగి బట్టలు

తొడుక్కున్నాను. చతికిలబడి కూర్చున్నాను.

ఆకలి ఎక్కువయ్యింది. ముప్పొద్దులా మెక్కేవాడ్ని. భరించడం కష్టంగా ఉంది.

అటూ ఇటూ చూసి నాలుగు ఆకులు త్రుంచి నోట్లో వేసుకున్నాను. పరమ చేదుగా ఉంది. ఊసేశాను. నీళ్ళు తాగి నేలమీద వెల్లకిలా పడుకున్నాను. క్రింది నుంచి వేడి ఆవిర్లొస్తున్నాయి. అయినా పట్టించుకోకుండా ఆకాశం వంక చూస్తూండి పోయాను.

ఇలా ఉత్త నీళ్ళు తాగి మూడ్రోజులుండగలడా? సాధ్యమేనా? పర్సు నిండా డబ్బుంది గనుక ఈ పక్కగా వెళ్ళే ఏ పడవనో లాంచీనో పిలిచి ఎక్కేసి ఈ పరీక్ష – కాదు కాదు – ఈ శిక్ష నుండి బయటపడితే?

ఛా. వెన్నిచ్చి పారిపోతే ఇంక నా గొప్పేంటి? చావో పెళ్లో తేల్చుకోవాల్సిందే!

ఆకాశం చుక్కల చీర కట్టుకుంది. ఆ చుక్కల మధ్య మెరిసిపోతూ రాకుమారి ప్రత్యక్షమైంది. ఆమె నవ్వు ఎంత బావుందో! దానికోసం యుద్ధాలే చేయొచ్చు! ఆమె దక్కితే శాన జీవితం దారి పొడవునా నవ్వులు పువ్వులు పూస్తాయి. బతుకు నందనవనమవుద్ది!

అసలామె ముందు ఇదో కష్టవేంటి? ఇదో రకం తపస్సు. మున్మాటికీ అంతే!

పూర్వం ఋషులు అడివిలో ఆకూ అలమూ తింటూ ముక్కు మూసుకుని ఒంటికాలి మీద నిలబడి తపస్సు చేసేవారంట. అద్భుత శక్తుల కోసం దేవుడి వరాల కోసం చేసేవారంట. నేనేమో దేవిని చేబట్టానికి చేస్తున్నాను. అంతే తేడా!

ఆలోచనల్నుంచి నిద్రలోకి, అక్కడ్నుంచి కలల్లోకి జారిపోయాను.

రాకుమారి తెల్లని చీర ధరించి దేవకన్యలా వచ్చింది. నా చేయి అందుకుంది. ఇద్దరం గాలిలో తేలిపోయాం. సుందర సుమధుర తీరాలకు ఎగిరి పోయాం. ఆ లోకం ఎంత గొప్పగా ఉందో. స్వర్గం అంటే అదే కామోసు!

ఎవరో సూదుల్తో గుచ్చుతున్నట్టన్పించి చటుక్కున లేచాను. పొద్దెక్కుతోంది. నేనెక్కడున్నదీ వెంటనే అర్థంకాలేదు. తర్వాత నిట్టూర్చాను.

మెల్లగా లేచి ఇసుకతో పళ్ళుతోమి ముఖం కడుక్కుని దోసెడు నీళ్ళు తాగాను. అవే కాఫీనీళ్ళనుకున్నాను.

ఏం చేయాలో తోచక సెల్ తీశాను. ఇంకా కోమాలోనే ఉందది.

లేచి అటూ ఇటూ పచార్లు చేశాను. అంగుళం అంగుళం పరికించి చూశాను. నత్తగుల్లలు, ఆల్చిప్పలు, అగ్గి పుల్లలు, సిగరెట్ పీకలు, చిప్స్ కవర్లు, కాగితాలు, కొట్టుకొచ్చిన కొబ్బరి ఆకులూ మట్టలూ పనికి రాని చెత్తా చెదారం...!

ఆకలి పేగుల్ని కొరికేస్తోంది. ఏదైనా పనిలో పడితే ఆకలి మర్చిపోవచ్చు!

చేయడానికే పనీ కన్పించలేదు. నదిలో ఈతకొట్టాను. నాతో చేపలు

సయ్యాటలాడసాగాయి.

వాటిని పట్టుకోడానికి గేలం ఉంటే బావుండేది, కాల్చుకుని తిని ఆకలి తీర్చుకునే వాణ్ణి!

బుర్రలో ఓ ఆలోచన మెరిసింది.

ఒడ్డు కెక్కి చక్కని కర్రముక్క వెదకి పట్టాను. ఆల్చిప్పతో మామిడికాయ తొక్క చెక్కడం గుర్తొచ్చింది. ఆల్చిప్ప మధ్యలో బెజ్జం పెట్టి దానితో కర్ర చివర చెక్కాను. బండగానే ఉన్నా ఫరవాలేదన్పించింది.

గోదారి ఒడ్డున కొంగలా కూర్చున్నాను. చేపలు ఒడ్డు దాకా వచ్చి వెళ్తున్నాయి. కొంచెం పెద్ద చేప రాగానే చటుక్కున కర్రతో గుచ్చాను. తప్పించుకుంది. మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి ఎట్టకేలకు విజయుడ్నయ్యాను. చెప్పరానంత ఆనందం కలిగింది.

చేప అరకేజీ బరువుంటుంది. కర్రతో చీల్చి ఆబగా ఓ ముక్కనోట్లో పెట్టుకున్నాను. ఉత్తరక్షణాన 'యాక్' అంటూ ఊసేశాను. చేప ముక్కల్ని కాలిస్తే చక్కగా తినొచ్చన్న ఆశతో వెదికితే అగ్గిపుల్లలు దొరికాయి గాని పెట్టె కన్పించలేదు. రాతిమీద గీశాను గాని అగ్గిపుల్ల మందు కాస్తా రాలిపోయింది. ఎన్నిసార్లు తడిసి ఎండిందో!

చేపని చీరికలుగా చీల్చి ఎండబెట్టాను. కాస్త ఉప్పు దొరికినా ఏదోలా మింగేసే వాణ్ణి. ఇక్కడ ఉప్పులేదు ఇసుకే ఉంది!

నెత్తి మాడి పోతోంది. ఇంత నీడ కూడా కరువయ్యింది. పొడుగ్గా ఎదిగిన చొప్పగడ్డి కంకులు కన్పించాయి. పడుకోడానికి సరిపడేంత జాగాలోని గడ్డిని పీకేసి నేలమీద పరిచాను. అటూ ఇటూ ఉన్న కంకుల్ని ముడి వేశాను. గడ్డి గూడు సగం ఎండని నిలువరిస్తోంది. దానిక్రింద పడుకుని చిన్నగా నిట్టూర్చాను. కడుపులోని ఆకలి కేకలు స్పష్టంగా విన్పిస్తున్నాయి.

ఎంత ప్రయత్నించినా నిద్రరాలేదు!

లేచి ఏవో మొక్కల ఆకులు పరపర నమిలాను. కొంచెం తీయగా అన్పించాయి మరికొన్ని తిని నీళ్ళు తాగాను. ఫరవాలేదని పించింది. పడుకున్నాను. నిద్ర పట్టేసింది.

లేచే సరికి చుట్టూ చీకటి కమ్ముకుని ఉంది. నీటి సవ్వడి విన్పించింది. ఒక్కంగలో వెళ్ళి ఒడ్డుని పరిశీలించాను. నీటి తాకిడి ఎక్కువగా ఉంది. గోదావరికి పోటొస్తోంది. సన్న సన్నగా ద్వీపం తరుగుతోంది.

ఒక్కటిన్నర రోజే అయ్యింది. ఇంకో అంత సేపు ఇక్కడే ఉండాలి. గుండెల్లో వింత శబ్దాలు మ్రోగాయి.

అంతా మునిగినా ఫర్లేదు. నిలబడేంత నేల మిగిల్తే చాలు. ఏదో తెలీని మొండిధైర్యం ధైర్యం చెప్పింది.

ధీమాగా పడుకున్నాను. నిద్ర రావట్లేదు.

నాకొచ్చిన పాటలూ పద్యాలూ పాడుకుంటూ లంకలో కల తిరిగి తిరిగి అలసిపోయాను. మళ్ళీ మళ్ళీ నీళ్ళు త్రాగాను. కడుపులో దేవుతోంది. ఆకలో పచ్చి ఆకుల ప్రభావమో తెలీట్లేదు.

ఏమైనా సరే నాకేమైనా సరే భరించి నిలవాలి!

రాకుమారి నాకోసం దివి నుంచి భువికి దిగి వచ్చిన అతిలోక సుందరిగా ఊహించుకుంటూ ఊహల ఊయలలూగాను. మనస్సు నిండా ఆనందపు పరిమళం అలుముకుంది. ఎప్పుడు నిద్రపోయానో నాకే తెలీదు.

తెల్లవారింది. చాలా నీరసంగా ఉంది. ఆకలి దంచేస్తోంది. చేపని పరిశీలించాను. బాగానే ఎండింది. కొంచెం కొరికాను. రుచిగానే ఉందన్పించింది. ఆబగా తినేశాను.

హమ్మయ్య! ఫర్లేదు! ఆకలి భయం పోయింది. రెట్టించిన ఉత్సాహంతో మళ్ళీ కర్ర తీసుకుని చేపల వేటలో పడ్డాను. ఒడుపు తెలిసిందేమో మూడు చేపల్ని తేలిగ్గా పట్టేశాను. చీల్చి ఎండబెట్టాను.

కడుపులో వికారంగా ఉంది. వాంతి వచ్చేలా ఉంది. నాలుగు ఆకులు నమిలాను. అప్పటిగ్గాని కుదుటపడలేదు.

రెండో రోజూ గడిచిపోయినట్టే. రేపు మధ్యాహ్నానికల్లా పులిరాజు గారొచ్చేస్తారు. రాకుమారిని నా చేతిలో పెట్టేస్తారు.

ఉత్సాహం నా ఒంట్లోకి వరదలా వచ్చింది. తీయని తలపులు ఉక్కిరి బిక్కిరి చేశాయి.

కాస్సేపు డాన్స్ చేశాను!

చీకటి పడే సరికి 'పోటు' 'ఎక్కువయింది. సగం దీవిని ముంచేసింది. ఈ రాత్రికి ఆ మిగిలిన ముక్కనీ మ్రింగేస్తే? అరె ఇవాళ పున్నమి. సముద్రానికి పోటొస్తుంది. గోదారికీ వస్తే?

గుండెలు గుబ గుబలాడాయి. కంటి మీద కునుకు లేకుండా గోతి కాడి నక్కలా కూర్చున్నాను.

వెన్నెల వాన ఆహ్లాద పరచాలని చూసింది గాని నా మనస్సు ఆందోళనని చల్లార్చ లేకపోయింది.

నీటి మట్టం మెల్ల మెల్లగా పెరుగుతోంది. ఇలాగే పెరిగితే తెల్లారే సరికి ఈ దిబ్బ మాయమై పోవడం ఖాయం. అప్పుడెక్కడ ఉండాలి?

ఎక్కడో అక్కడ ఎలాగోలా ఉండాలి. ఇక్కడ్నుంచి వెళ్ళిపోతే ఓడినట్టే! ప్రాణం పోయినాసరే ఇక్కడ్నుంచి కదలడు గాక కదలడు!

కొబ్బరి ఆకుల్నీ మట్టల్నీ పోగుజేశాను. వాటన్నిట్నీ తీగల్తో రకరకాల తాళ్ళ ముక్కల్తో

తెప్పలా కట్టాను. గోదారిలోకి తోసుకెళ్ళి దానిమీద కూర్చున్నాను. మునిగిపోలేదు. వెర్రి సంబరం చుట్టేసింది.

దాన్ని ఒడ్డుకు లాగి లంక మధ్యలో జాగరణ చేస్తూ కూర్చున్నాను. అతికష్టం మీద తెల్లవారింది. అయిదారడుగుల నేల మాత్రమే మిగిలి ఉంది. మిగతాదంతా జలమయమయ్యింది. దాని మీదకి తెప్పలాగి తెప్పమీద కూర్చున్నాను.

పూర్తిగా ముంచేసినా నేను తేలిపోతాను. నాకేం కాదు!

ఎండిన ఇంకో చేపనీ ఇన్ని ఆకుల్నీ తిని ఆకలి చల్లార్చాను.

క్రితంసారి నన్నక్కడ ఏ టైములో వదిలారో అదే టైముకి పడవలో వచ్చారు పులిరాజుగారు.

లేచి నిలబడ్డాను. నన్నూ తెప్పనీ నా వాలకాన్నీ రెండు చేతుల్లోని రెండు చేపల్నీ చూశారు. మరేం మాట్లాడలేదు.

పడవెక్కి కూర్చున్నాను.

ఇంటికి తీసుకెళ్ళారు.

తలస్నానం చేసొచ్చేసరికి వేడి వేడి భోజనం వడ్డించారు.

తాంబూలం తెచ్చి ఇచ్చింది రాకుమారి.

పులిరాజుగారూ ఆయన భార్యా వచ్చారు. ఆనంద బాష్పాలు రాలుస్తూ నన్ను అభినందనలతో ముంచెత్తారు.

రెండు పూల దండలివ్వగా మార్చుకున్నాం.

“మీ పెళ్లి అయిపోయింది. ఇంతకంటే ఘనంగా చెయ్యలేను. నీ భార్యని తీసుకెళ్ళిపో. మితిమీరిన ఆడంబరాలు, సోమరితనం నా కొంపకూల్చాయి. అప్పులే మిగిలాయి. ఇంటిని స్వాధీనం చేసుకోడానికి అప్పులోళ్ళు కాచుక్కూర్చున్నారు. మీరెళ్ళేక మేమూ ఎక్కడికో పోయి తలదాచుకుంటాం...” గాద్గదిక స్వరంతో అన్నారు పులిరాజుగారు.

“మీరు మాతో వస్తున్నారు. మీ అందర్నీ పోషించగల సత్తా నాకుంది” భుజాలు పొంగిస్తూ చెప్పాను.

రాకుమారిని సందిట్లోకి తీసుకుని విజయహాసం చేశాను.

* * *

**(స్వాతి వారపత్రిక–22–4–2016)**